ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 03.11.2024 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఈ నెల ఆరో తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర కులగణన సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంచించనుంది. 50వేల సిబ్బంది ఈ సర్వేల పాల్గొంటారు.
2. కేంద్రంలో పదేళ్ల బీజేపీ పాలనలో విద్వేశ ప్రచారం, విధ్వంస చర్యలు తప్ప దేశానికి చేసింది శూన్యమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు.
3. సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ రోజు పాల్గొంటారు.
4. ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థినుల సంఖ్య 60 కు చేరుకుంది. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది.

-----------------------

**కులగణన**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే – కులగణన ఈ నెల 6 నుంచి ప్రారంభం కానుంది. దీనికి అవసరమైన అన్ని ఏర్పాట్లను

అధికారులు చేస్తున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనకబడిన వర్గాల వారికి మెరుగైన విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు పెంచేందుకు వీలుగా ఈ కార్యక్రమం చేపట్టేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటికే సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లుగా పనిచేయాల్సిన వారికి అవసరమైన శిక్షణ పూర్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 50వేల మంది అధికారులతో సర్వే చేయడం జరుగుతుందన్నారు. ఒక్కో అధికారి 150 ఇళ్లకు వెళ్లి సర్వే చేస్తారు. రెండు దశల్లో ఈ సర్వే జరగనుంది. మొదటి దశలో ఆరో తేదీ నుంచి మూడు రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న ఎన్యూమరేటర్లు, ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ యజమాని పేరు నమోదు చేసుకుంటారు. అనంతరం సీరియల్ నంబర్ తో స్టిక్కర్ వేస్తారు. రెండోదశలో సమగ్ర కుటుంబ సర్వే చేపడతారు. సర్వేలో ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కులంతో పాటు మొత్తం 75 ప్రశ్నలకు వివరాలు సేకరిస్తారు.

**DESK**

------------------------------

**చామల కిరణ్ కుమార్ రెడ్డి**

రాజ్యాంగ ఫలాలు అన్నివర్గాల ప్రజలకు సమానంగా అందించాలనే లక్ష్యంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేకు శ్రీకారం చుట్టిందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ నెల 6 నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం కానున్న నేపథ్యంలో పీసీసీ పిలుపు మేరకు నిన్న ఆలేరులో యాదాద్రి భువనగిరి జిల్లాస్థాయిలో కాంగ్రెస్ శ్రేణులకు జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా

కొన్నివర్గాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. సర్వే చేసే సిబ్బందికి పార్టీ శ్రేణులు సహకరించాలన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ 1931 తర్వాత కులాల వారీగా సంఖ్యను తేల్చేందుకు జరుగుతున్న సర్వే కావడంతో అత్యంత ప్రాధాన్యం సంతరించుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుమార్ అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

**పీటీసీ యాదాద్రి భువనగిరి**

--------------------

**కడియం**

కుల గణనతోనే ప్రతి ఒక్కరికి న్యాయం చేకూరుతుందని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి అన్నారు. నిన్న జనగామ మండల కేంద్రంలోని భ్రమరాంబ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వే పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

**పిటిసి_జనగామ జిల్లా**

-------------------------

**పొన్నం ప్రభాకర్**

కేంద్రంలో పదేళ్ల ఎన్డీఏ పాలనలో విద్వేశ ప్రచారం, విధ్వంస చర్యలు తప్ప దేశానికి చేసింది శూన్యమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు.

ఎన్నికల హామీల అమలులో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన విమర్శలకు సామాజిక మాధ్యమం ఎక్స్ లో స్పందించారు. విభజన హామీలు నెరవేర్చలేదని, ఎరువులు, గ్యాస్ సబ్సిడీలు, ఉపాధి హామీ నిధుల్లో బీజేపీ ప్రభుత్వం కోత విధించిందన్నారు. పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరల వాతలు మీ పాలన వైఫల్యానికి నిదర్శనాలని విమర్శించారు.

**DESK**

---------------------------

**బండి సంజయ్**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, కుంభకోణాలపై కాంగ్రెస్ పార్టీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తితో పూర్తి స్థాయి విచారణకు హామీ ఇచ్చిందని, ఇంత వరకు చర్యలు తీసుకోలేదని సామాజిక మాద్యమం ఎక్స వేదికగా బండి సంజయ్ ప్రశ్నించారు.

**డెస్క్**

-------------------------

**భట్టి విక్రమార్క**

సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ రోజు పాల్గొంటారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డితో కలసి యాదాద్రి విద్యుత్ కేంద్రాన్ని సందర్శిస్తారు. అనంతరం యాదాద్రి పవర్ ప్లాంట్ స్టేజి-1 లో ఉత్పత్తి చేసిన విద్యుత్తును గ్రిడ్డుకు అనుసంధానించే కార్యక్రమంలో పాల్గొంటారు. యాదాద్రి పవర్ ప్లాంట్ పురోగతి పనులపై అధికారులతో సమీక్షిస్తారు. సూర్యాపేట జిల్లాలోని హుజూర్నగర్ నియోజకవర్గం గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలో 200 కోట్లతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ భవన నిర్మాణానికి మంత్రులతో కలిసి శంకుస్థాపన చేస్తారు. హుజూర్నగర్ లోని రామస్వామి గుట్ట వద్ద నిర్మాణంలో ఉన్న హౌసింగ్ కాలనీని సందర్శించి లబ్ధిదారులతో ముచ్చటిస్తారు.

**పీటీసీ, సూర్యాపేట**

-------------------------

**బీసీ కమిషన్**

రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాను ఖరారు చేసే అంశం పైన ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిన్న బీసీ కమిషన్ నిర్వహించిన బహిరంగ విచారణకు మొత్తం 230 విజ్ఞాపనలు వచ్చాయి. బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ నేతృత్వంలోని బృందం నిన్న హన్మకొండ కలెక్టరేట్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పలు బీసీ సంఘాల నాయకులు ప్రజాప్రతినిధులు కమిషన్ కు పలు వినతులను అందించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ జిల్లా నుంచి 86, వరంగల్ జిల్లా నుండి

56 , ములుగు జిల్లా నుండి ఏడు, భూపాలపల్లి జిల్లా నుంచి 28 , జనగామ జిల్లా నుంచి 27, మహబూబాబాద్ జిల్లా నుంచి 26 చొప్పున మొత్తం 230 విజ్ఞాపనలు వచ్చాయి.

**వరంగల్ పీటీసీ**

-----------------------

**మంద కృష్ణ**

రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ అడ్డుపడుతోందని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో నిన్న సాయంత్రం ఏర్పాటు చేసిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ధర్మయుద్ధ సదస్సులో మందకృష్ణ మాదిగ పాల్గొని ప్రసంగించారు. ముప్పై సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తరువాత ఎస్సీ వర్గీకరణ జరుగుతుంటే మాలలు దానిని వ్యతిరేకిస్తున్నారని, వారికి కాంగ్రెస్ పార్టీ మద్దతిస్తోందని విమర్శించారు. ఇటీవల జరిగిన డీఎస్సిలో కూడా వర్గీకరణ లేకుండా నియామకాలు చేపట్టిందన్నారు. వర్గీకరణ కోసం ఎంతో మంది ప్రాణత్యాగం చేశారని వారి త్యాగానికి విలువ ఇవ్వాలని కోరారు.

**ఆదిలాబాద్ పీటీసీ**

---------------------------------

**విద్యార్థినుల అస్వస్థత**

ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి ఆశ్రమ పాఠశాలలో భోజనం అనంతరం అస్వస్థతకు గురైన విద్యార్థినుల సంఖ్య 60 కు చేరుకుంది. శుక్రవారం నాటికి 45 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురి కాగా తాజాగా మరో 15 మంది అనారోగ్యం పాలయ్యారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. వారిలో శైలజ అనే విద్యార్థినికి వెంటిలేటర్ పై చికిత్స అందిస్తున్నారు. ITDA పీవో ఖుష్బూ గుప్త ఆశ్రమ పాఠశాలకు చేరుకుని పరిస్థితిపై ఆరా తీశారు. సమస్యకు గల కారణాలు తెలుసుకుని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, విద్యార్థినులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి, GCDO శకుంతల పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

**పీటీసీ ఆసిఫాబాద్, డెస్క్**

------------------------------

**అపెరల్ పార్క్**

రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని అపెరల్ పార్క్ లో నిల్వ చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచించారు రాజన్న సిరిసిల్ల జిల్లా . పెద్దూరు శివారులోని అపెరల్ పార్క్ ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో రైతుల నుంచి ఖరీఫ్ సీజన్-2024లో

కొనుగోలు చేసే 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసేందుకు అవసరమైన గోదాముల సామర్థ్యం ఉందన్నారు.

**పీటీసీ, రాజన్న సిరిసిల్ల**

-----------------------------

**దేవాదుల**

హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పెద్దకోడెపాక శివారులో దేవాదుల గేట్‌వాల్ ఈరోజు లీకైంది. దీంతో పెద్ద మొత్తంలో నీరు వృథాగా పోతోంది. జోగంపల్లి శివారులోని చలివాగు ప్రాజెక్టు నుంచి ధర్మసాగర్‌కు నీటిని తరలించేందుకు ఫేజ్2లో భాగంగా ఈ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారు. చలివాగు ప్రాజెక్టు వద్ద ఉన్న దేవాదుల సబ్‌స్టేషన్‌లో విద్యుత్తు సమస్య తలెత్తి మోటార్ల నుంచి ఎక్కువ ఒత్తిడితో నీటి ప్రవాహం జరగడం వల్ల గేట్ వాల్ లీకేజీ జరిగినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. వెంటనే మోటార్లను నిలిపివేసి మరమ్మతు చర్యలు చేపట్టినట్లు అధికారులు చెప్పారు.

**డెస్క్**

---------------------------

**విజిలెన్స్ అవేర్ నెస్ వీక్**

అవినీతి వల్ల ఎదరయ్యే దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు కేంద్ర బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి), హైదరాబాద్ జోనల్ కార్యాలయం ఈరోజు వాకథాన్ నిర్వహించింది. జోనల్ కార్యాలయ పరిధిలోని

సిబ్బంది, ఏజెంట్లతో ఈ కార్యక్రమం నిర్వహించింది. విజిలెన్స్ అవగాహనా వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆన్‌లైన్ క్విజ్, వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ మేనేజర్ పునీత్ కుమార్, రీజనల్ మేనేజర్ ఆర్ సతీష్ బాబు పాల్గొన్నారు.

**పీఎస్**

------------------------

**బతుకమ్మ**

దీపావళి తర్వాత నిర్వహించే బతుకమ్మ వేడుకలు ఈరోజు హనుమకొండ జిల్లా హసన్పర్తి మండలం సీతంపేట గ్రామంలో ఘనంగా జరుపుకుంటున్నారు. ప్రతీ సంవత్సరం దీపావళి పండుగ రోజుల్లో ఇక్కడ బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తారు. దాదాపు 100 సంవత్సరాలకు పైగా ఈ గ్రామంలో ఈ ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. మొత్తం మూడు రోజులపాటు జరిగే ఈ బతుకమ్మ వేడుకలలో నేడు చివరిరోజు సీతంపేట గ్రామంలోని నేతకాని కులానికి చెందినవారంతా స్త్రీ పురుష భేదం లేకుండా అందరూ బతుకమ్మ ఆడుతారు

**పీటీసీ హనుమకొండ**

------------------------

**ఉల్లాస్ పథకం**

వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకం కింద చర్యలు తీసుకుంటున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. జాతీయ విద్యా విధానం ద్వారా వరంగల్ జిల్లాలో 19 వేల 8 వందల 8 మంది వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు. ప్రతి ఐదుగురు వయోజనులకు ఒక వాలంటీర్ చొప్పున నియమించి కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు.

**పీటీసి, వరంగల్**

---------------------

**జాతీయ రహదారి**

జాతీయ రహదారి 365 బి ని రాజన్న సిరిసిల్ల జిల్లా మీదుగా కోరుట్ల వరకు విస్తరించాలని, రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షులు, కరీంనగర్ మాజీ ఎంపి బోయినిపల్లి వినోద్ కుమార్ కోరారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్నట్లుగా సూర్యాపేట, జనగామ, సిద్దిపేట, సిరిసిల్ల వేములవాడ పట్టణాల మీదుగా నిర్మిస్తున్న జాతీయ రహదారిని విస్తరించాలని నిన్న రాజన్న సిరిసిల్ల జిల్లా తెలంగాణ భవన్ లో జరిపిన విలేకరుల సమావేశంలో కోరారు.

**పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా**

---------------------------